

## మానవ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

**భీమవరం :** జిల్లాలో మానవ అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉన్నారు. ఈ నెల 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి నడవడికపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ముఖ్యంగా పోలీస్‌శాఖ పిల్లల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ నెంబర్లు 1098, 1800, 1027, 222 గురించి జిల్లాలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. డిఆర్ఒ ఎం. వెంకటేశ్వర్లు, డిపిఒ ఎ.రామనాథరెడ్డి, చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పీడీ బి.లక్ష్మి, డిఇఒ ఇ.నారాయణ పాల్గొన్నారు.

# మార్గదర్శకులేరీ..!

**బంగారు కుటుంబాలకు దాతలు కరువు**
**జిల్లావ్యాప్తంగా 64,940 కుటుంబాలు గుర్తింపు**
**ఇప్పటి వరకు కేవలం 16,833 కుటుంబాలే దత్తత**
**మిగిలిన 48,107 కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకం**
**15 నాటికి దత్తత పూర్తి కావాలని ప్రభుత్వ ఆదేశం**
**ఒత్తిడితో తల్లడిల్లుతున్న అధికారులు**
**పట్టించుకోని ప్రజాప్రతినిధులు**



**ప్రజాశక్తి - భీమవరం**

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఆర్థికంగా భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పి-4 విధానం క్షేత్రస్థాయిలో ఫలించడం లేదు. పబ్లిక్, ప్రయివేట్ పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్ (పి-4) లక్ష్యం చేరడం కష్టతరంగా మారింది. జిల్లాలో పి-4కు ప్రణాళిక రూపొందించినప్పటికీ అమలుకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు, ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలం కలిపి 20 మండలాలు ఉన్నాయి. 535 గ్రామ సచివాలయాలు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం మున్సిపాల్టీలు, ఆకివీడు నగర పంచాయతీ ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 5,17,300 కుటుంబాలు ఉన్నాయి. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పి-4 చేపట్టి మూడు నెలల క్రితం సర్వే పూర్తి చేసింది. ఈ సర్వేలో 64,940 బంగారు కుటుంబాలను గుర్తించారు. ఉన్నత, సంపన్న వర్గాల్లో పది శాతం మందిని ఎంపిక చేసి వారి సాయంతో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. జిఎస్‌డబ్ల్యుఎస్ డేటాబేస్, ఇంటింటా సర్వేను ప్రామాణికంగా తీసుకున్నారు. జిల్లాలో 535 సచివాలయాలు ఉండగా 352 సచివాలయాల పరిధిలో 64,940 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించారు. ఈ కుటుంబాల పరిధిలో సుమారు లక్షా 70,803 మంది జనాభా ఉన్నారు. అయితే కేవలం 16,833 కుటుంబాలనే దత్తత తీసుకోవడానికి మార్గదర్శకులు ముందుకొచ్చారు. మిగిలిన 48,107 బంగారు కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం మార్గదర్శకులను వెతికే పనిలో అధికారులు నిమగ్నమైనప్పటికీ తీసుకున్న లక్ష్యానికి, ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు సమకూర్చిన దాతలకు పొంతన లేకుండాపోయింది. ఒకపక్క జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులతో సమీక్షలు చేస్తున్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు రావట్లేదు. అధికారులు మార్గదర్శకుల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నప్పటికీ దాతలు ముందుకొచ్చే పరిస్థితి కనిపించట్లేదు. కొంతమందిని బలవంతంగా ఒప్పిస్తున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. అధికారులు లక్ష్యాన్ని చేరుకోవడానికి నానావస్థలు పడుతున్నారు. అయితే ఇదిలా ఉంటే జిల్లాలో ప్రజాప్రతినిధులు పి-4ను పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రభుత్వం పి-4ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెద్దగా లేదనే విమర్శ ఉంది. జిల్లా అధికార యంత్రాంగం అంతా పి-4పై కుస్తీ పడుతుంటే ప్రజాప్రతినిధులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడట్లేదని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యం నీరుగారే పరిస్థితి కన్పిస్తోంది.

**అధికారుల మెడపై కత్తి..!**

పి-4 విజయవంతానికి ప్రత్యేక అధికారులను నియమించారు. 20 మండలాలకు 20 మంది ప్రత్యేక అధికారులను నియమించగా, మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమిషనర్లకే బాధ్యత అప్పగించారు. ప్రత్యేక అధికారులు బంగారు కుటుంబాల గుర్తింపుతోపాటు మార్గదర్శకుల వివరాల సేకరణకు చర్యలు చేపడుతున్నారు. గ్రామస్థాయి కమిటీలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, స్థానిక రిప్రజెంటేటివ్, స్వయం సహాయక సంఘాల సభ్యురాలు ఉన్నారు. మండలస్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ, మండల వ్యవసాయాధికారి, ఇతర అధికారులతో కమిటీ నియమించారు. అయితే దాతలను ఒప్పించేందుకు అధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఏం చేస్తారో, ఎలా చేస్తారో తమకు తెలియదని, దాతలను ఒప్పించి తీరాల్సిందేనని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే నేరుగా అధికారులు, ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని హుకుం జారీ చేసి బలవంతంగా అధికారులను, ఉద్యోగులను ఒప్పించే ప్రయత్నం జిల్లా అధికారులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శులు, మధ్యతరగతి, చిరుద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఒకపక్క కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతుంటే బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒకపక్క విధులు నిర్వహించలేక, మరోపక్క లక్ష్యాలు చేరుకోలేక, ఇంకోపక్క ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేక నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు.

**మరోసారి పి-4 సర్వే..**

జిల్లావ్యాప్తంగా 64,904 కుటుంబాలను గుర్తించినప్పటికీ మరోసారి పి-4 సర్వే నిర్వహిస్తున్నారు. బంగారు కుటుంబాల జాబితాలో అనర్హులు ఎవరైనా చేరారా, లేక అర్హులు చేరలేదా అనే అంశాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఎంపిక చేసిన బంగారు కుటుంబాల సంఖ్యను వివిధ కారణాలతో తగ్గించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని ప్రచారం సాగుతోంది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, గ్రామపెద్దలు, రిటైర్డ్ ఉద్యోగులను గ్రామాలు, పట్టణాలవారీ ఎంపిక చేసి బంగారు కుటుంబాలతో సమావేశాల నిర్వహణకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను మ్యాపింగ్ చేస్తారు. కమిటీ సమావేశాలు ఈ నెల 31లోగా పూర్తి చేసి నూరుశాతం దత్తత పూర్తయ్యేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం జిల్లాలో ఆయా సచివాలయాల వద్ద గ్రామసభలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి కావాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు, సిబ్బంది ఉరుకులు, పరుగులు తీస్తున్నారు.

# మీ సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా

## 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో హోంమంత్రి అనిత



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న హోంమంత్రి అనిత

**ప్రజాశక్తి - ఆకివీడు**

'మీ సమస్యలు తెలుసుకునేందుకే మీ ముందుకు వచ్చానని' రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం హోంమంత్రి ఆకివీడు వచ్చారు. ఆమెకు ఏలూరు జిల్లా సరిహద్దు ఉప్పుటేరు వద్ద పార్టీ ప్రముఖులు, అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్థానిక వేలంపేట రామాలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా దొరగారు చెరువుగట్టునున్న ఎన్‌టి రామారావు కాంస్య విగ్రహానికి, అక్కడే ఉన్న అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రచారం ప్రారంభించారు. సుమారు రెండు గంటల ప్రచారం అనంతరం రామాలయం వేదిక వద్ద ఆమె మాట్లాడారు. ప్రజలు వేసిన ఓటుకు జవాబుదారీతనం ఉండాలని, ఆ జవాబుదారీ తనం లేక జగన్ బాధ్యతలు విస్మరించారని తెలిపారు. ఉండి నియోజకవర్గంలో సీసీ కెమెరాలు తమ శాఖకు ఎంతగానో సహకరిస్తున్నాయని ప్రశంసించారు. డిప్యూటీ స్పీకర్ బాధ్యతలో ఉన్న త్రిబుల్ ఆర్ పార్టీ కార్యక్రమంలో పాల్గొనడం ఇష్టం లేకనే రాలేదన్నారు. ప్రచారంలో పాల్గొన్న ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ప్రతి సమస్యకూ పరిష్కారం దొరుకుతుందని, ఎవరూ తొందర పడొద్దని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి రామవరప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, గొంట్ల గణపతి గంధం ఉమా సత్యనారాయణ, నవ్వుకోట్ల రామారావు, స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# పారదర్శకతతో అర్జీలు పరిష్కరించాలి

## కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - భీమవరం**

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పారదర్శకత, నాణ్యతతో ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, డిపిఒ ఎం.రామ్‌నాథరెడ్డి ప్రజల నుండి 234 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలపై నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో సందర్భంలో ఫిర్యాదుల పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదుదారులతో అధికారులు మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# పేదలకు భూమి దక్కే వరకూ పోరు ఆగదు

**ఎర్రకాలువ మిగులు భూములను పేదలకిచ్చి ఏక్ సాల్ పట్టాలివ్వాలి**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**
**మిగులు భూముల్లో దుక్కి దున్ని, నాట్లు వేసిన నేతలు, పేదలు**



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం**

ప్రభుత్వ భూములపై భూమి లేని నిరుపేదలకు చట్టప్రకారం పూర్తి హక్కు ఉందని, ఆ భూములు పేదలకు దక్కేంత వరకు భూపోరాటం ఆగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జంగారెడ్డిగూడెం ఎర్రకాల్వ రిజర్వు ప్రాజెక్టు పరిధిలో మిగులు భూములను జంగారెడ్డిగూడెం, టి. నరసాపురం మండలాల భూపోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో పేదలు సాగు చేస్తున్న భూములను సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగలితో దుక్కి దున్ని వరినాట్లు వేసి సాగు పనులు ప్రారంభించారు. ఆ భూముల్లో ఎర్రజెండా పాతి పోరాట స్ఫూర్తి నింపారు. అనంతరం ముదిగొండ భూపోరాటంలో అమరులైన ఏడుగురికి ఘననివాళి అర్పించారు. తొలత జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో జంగారెడ్డిగూడెం మండలం లక్ష్మీపురంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఇతర నాయకులకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎ.పోలవరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మిగులు భూముల సమీపంలో శ్రీనివాసరావుకు మహిళలు బొట్టు పెట్టి, శాలువా కప్పి ఆహ్వానం పలికారు. అక్కడ నుంచి పాదయాత్రగా పొలాల్లోకి చేరుకుని సాగు చేస్తున్న పేదలను భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటిలో మునగకుండా ఉన్న ఎర్రకాలువ మిగులు భూములు మూడు వేల ఎకరాలను భూస్వాముల వద్ద నుండి ఇరిగేషన్ అధికారులు స్వాధీనం చేసుకుని పేదలకు ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిహారం పొందిన భూస్వాములే వాటిని అనుభవించడం తగదన్నారు. ఆ భూములపై పేదలు తమకు హక్కు ఉందని, మేము సాగు చేసుకుంటామని సాగు చేపట్టారని, అప్పటి వరకు మొద్దు నిద్రలో ఉన్న అధికారులు సాగు చేయడానికి వీల్లేదని పేదలను వేధించి, నిర్బంధకాండ సాగిస్తూ అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. పేదలు మీటింగ్ పెడితే పోలీసులు డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్నారని, పోలీసులు పరిశీలించాల్సింది పేదలు, రైతులు, కమ్యూనిస్టు నాయకులను కాదని, ప్రజల సొత్తును బకాసురులుగా మేస్తున్న భూస్వాములను అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన ఏఒక్క భూస్వామిపైనైనా కేసులు పెట్టారా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు భూస్వాములు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయన్నారు. టి.నరసాపురం మండలంలో మహిళలు, గర్భిణులని చూడకుండా వ్యవసాయ కార్మికులపై ఇష్టానుసారంగా కేసులు పెట్టారని, ఇరిగేషన్ భూములన్నీ భూస్వాములు పందికొక్కుల్లా మేస్తుంటే ఆ శాఖ ఏం చేస్తుందని ప్రశ్నించారు. పేదలకు నోటీసులు ఎలా ఇస్తారని, కేసులు ఎలా పెడతారని, మీకు ఆ అధికారం ఎవరిచ్చారని నిలదీశారు. చట్టప్రకారం ప్రభుత్వ భూములను అనుభవించే హక్కు భూమిలేని పేదలకు, వ్యవసాయ కూలీలకు ఉందన్నారు. ఇది ప్రభుత్వ చట్టం అవునో, కాదో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. పేదలను వేధిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పేదలకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకోవాలని, పేదల సాగుకు అనుమతించాలని అన్నారు. దిగువలోతట్టు ప్రాంతాలు కాబట్టి ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని చట్టాలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. భూములు తీసుకుని పరిశ్రమలు పెట్టని పారిశ్రామికవేత్తలపై ఏవిధమైన చర్యలు తీసుకున్నారని మండిపడ్డారు. డబ్బులు పోస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. పేదలకు ఉపాధి హామీని దూరం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ ఎర్రకాలువ మిగులు భూములు ప్రభుత్వ భూములేనన్నారు. 2007లో ముదిగొండలో పెద్దఎత్తున భూపోరాటం జరిగితే ఏడుగురు చనిపోయారన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సు మేరకు ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, భూములు సాధించుకునే వరకు పోరాటం ఆపొద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎం.నాగమణి, ఎం.జీవరత్నం, గుడెల్లి వెంకట్రావు, రామకృష్ణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలి



తాడేపల్లిగూడెం : కరపత్రాలు అందజేస్తున్న సిపిఎం నేతలు



పెనుగొండలో..

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

అదానీ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎనిమిదో రోజు శేషమహల్ ఏరియా, మసీదు రోడ్డు, వీకర్స్ కాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరై మాట్లాడారు. 2024 ఎన్నికల ముందు గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిందని, అదానీ స్మార్ట్ మీటర్లు తీసుకొస్తోందని దీనికి వ్యతిరేకంగా బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి అధికారంలోకి వచ్చిన టిడిపి గత ప్రభుత్వం కంటే ఎక్కువ భారాలను రాష్ట్ర ప్రజలపై మోపడాన్ని ఆయన ఖండించారు. ప్రజలకు షాక్ కొట్టే అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపకపోతే దశలవారీగా ఆందోళనలు చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు జవ్వాది శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 9 నెలల్లోనే కోట్ల రూపాయలు భారాలు మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపాలని లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, కన్నంరెడ్డి శివాజీ, తోట శ్రీను, నగిరెడ్డి సాయి, యడ్ల శ్రీను, పకుర్తి చిన అప్పారావు, కె.ఉదయ్ కుమార్, వి.అప్పారావు,పి.నాగేంద్రబాబు పాల్గొన్నారు.

**పెంటపాడు :** ప్రజలకు షాక్ కొట్టే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెంటపాడులోని గేట్ సెంటర్లో సోమవారం నిరసన తెలిపారు. ఈ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, మండల కన్వీనర్ సిరపరపు.రంగారావు, రైతు సంఘం నాయకులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలపై 25 వేల కోట్ల రూపాయల భారం మోపే విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై అదనపు భారాన్ని విధించే స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారన్నారు. అద్వానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, పాత విధానాన్ని కొనసాగించాలని లేకుంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంకూరు నాగేశ్వరరావు, దూలం ప్రసాద్, బర్ల బాలాజీ, దత్తు రాము, తెర్లి రాజేష్ పాల్గొన్నారు.

**పెనుగొండ :** స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఈ మేరకు పెనుగొండ మండల కేంద్రంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరణ చేయడం ద్వారా కార్పొరేట్లకు కట్ట పెట్టడానికి చేస్తున్న కుట్రలో ఇది ఒక భాగమన్నారు. కరెంటు ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని లేకపోతే విద్యుత్ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోతామని తెలిపారు. అనంతరం పెనుగొండ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి షేక్ పాదుషా, గ్రామ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, గుడిమెట్ల వరహాల్‌రెడ్డి, కుడిపూడి గోపాలకృష్ణ, పాల ఏడుకొండలు, తాతయ్య, పాల్గొన్నారు.

# ఉద్యోగులపై పి4 భారం విరమించుకోవాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

**భీమవరం :** 4 నెలలుగా పి4 పేరుతో పేదరికాన్ని నిర్మూలిస్తామని సంపన్నులు ముందుకొచ్చి మార్గదర్శకులుగా నిలబడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఊదరగొడుతున్నారని, వారికి కార్పొరేట్లు, సంపన్నుల నుండి ఆశించిన స్పందన రాలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పి4 భారాన్ని ఉద్యోగులపై నెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయులు ఒక్కొక్కరూ ఐదుగురిని దత్తత తీసుకోవాలని డిఇఒల ద్వారా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దారుణమని తెలిపారు. మరోవైపు ప్రతి సచివాలయ కార్యదర్శీ తప్పనిసరిగా ఇద్దరిని దత్తత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు, ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వకుండా, వారి హక్కులను హరిస్తూ, వారిపై భారాలు మోపుతూ, లేబర్ కోడ్‌లు వంటి దుర్మార్గ చట్టాలను రుద్దుతూ మరోవైపు వారిపై పి4 భారాన్ని నెట్టడం అమానుషమని పేర్కొన్నారు. తక్షణం ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవిక దృక్పథంతో ముందుకొచ్చి పేదరిక నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఉపాధి కల్పన జీతాల పెంపుదల, భూ పంపిణీ వంటి చర్యల ద్వారా పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## వివేకవర్మకు ఐఐటి ఖరగ్‌పూర్‌లో సీటు



**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మండలంలోని నెలమూరు గ్రామానికి చెందిన విద్యార్థి పాతపాటి వెంకట వివేకవర్మ జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో 132 ర్యాంకు సాధించి వెస్ట్‌బెంగాల్ రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన ఖరగపూర్ ఐఐటిలో సీటు సాధించాడు. సోమవారం కాంపస్‌లో చేరినట్లు విద్యార్థి తండ్రి శ్రీనివాసరాజు తెలిపారు. వివేకవర్మ ఖరగ్‌పూర్ ఐఐటిలో సీటు సాధించడంతో మండలంలోని పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగ, రాజకీయ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# రోడ్డుపై రోడ్డు.. వేస్తున్నారు మళ్లీ ..!

**ప్రజల విమర్శలను పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**



వీరవాసరంలో బొక్కావారివీధిలో సీసీ రోడ్డుపై మళ్లీ వేస్తున్న రోడ్డు

**ప్రజాశక్తి - వీరవాసరం**

వీరవాసరం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లపై సీసీ రోడ్లు వేస్తూ అభివృద్ధి చేసిన ప్రాంతాన్నే మరోసారి అభివృద్ధి చేస్తున్నారు. అదే విధంగా వీరవసరం రెండో వార్డు బొక్కావారి వీధిలో సీసీ రోడ్డు పైనే మరోసారి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఇప్పటికే గ్రామంలో అనేక ప్రాంతాల్లో మట్టి రోడ్లు ఉండగా అటువంటి వాటిని విస్మరించి వేసిన వాటిపైనే మరలా వేస్తున్నారంటూ ప్రజాశక్తి పలుసార్లు కథనాలు ప్రచురించడం జరిగింది. ఈ కథనాలకు స్పందించిన ఎంఎల్‌ఎ అంజిబాబు ఎంపిడిఒ, ఎంపిపిలతో నిజనిర్ధారణ చేయించడం జరిగింది. ప్రజాశక్తి కథనాల్లో వాస్తవాలను గ్రహించి కొన్ని నిధులను వేరే రోడ్ల అభివృద్ధికి కేటాయించారు. రోడ్లపై రోడ్లు వేయడంలో ఇంజినీరింగ్ అధికారులు ఎంఎల్‌ఎను తప్పుదోవ పట్టించిన దాఖలాలున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల తీరును ప్రజలు తప్పుపడుతున్నా అవేమీ తమకు కావన్నట్లు వ్యవహరిస్తున్నారు. బొక్కావారి వీధిలో ఇప్పటికే ఉన్న సీసీ రోడ్డును స్థానికులే ముందస్తు పెట్టుబడి పెట్టుకుని గతంలో పనికి ఆహార పథకంలో వారి ఆధ్వర్యంలో పటిష్టంగా వేసుకున్నారు. ఇప్పటి వరకూ చెక్కుచెదరకుండా ఉన్న ఆ రోడ్డు పైనే మరోసారి రోడ్డు వేసేందుకు నిధులు ఏ విధంగా కేటాయించారో, ఏవిధంగా ఇంజినీరింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారో చెప్పాల్సి ఉంది. ఈ మార్గంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు పంచాయతీకి కేటాయించిన కామన్ సైటులో కాకుండా ప్రధాన మార్గం స్థలంలోనే సీసీ డ్రెయిన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చి పంచాయతీ అధికారులు నిబంధనలకు పాతరేశారు. దీంతో రహదారి వెడల్పు తగ్గిపోయి అత్యవసర సమయాల్లో ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితులను కల్పించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మట్టి రోడ్లతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు నడిచేందుకు వీలులేని పరిస్థితులతో నానా అవస్థలు పడుతున్న దృశ్యాలు కనపడుతున్నా కళ్లున్నా కబోదిలా నటించడం కొంత మంది అధికారులకు, ప్రజాప్రతినిధులకే చెల్లిందన్న విమర్శలున్నాయి. అదే విధంగా వీరవాసరంలో మరికొన్ని చోట్ల సీసీ రోడ్లపైనే సీసీ రోడ్లు వేసేందుకు తీర్మానాలు చేయడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి మట్టి రోడ్లను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

## డిఎంహెచ్ఒ గీతాబాయి



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ గీతాబాయి

**ప్రజాశక్తి - భీమవరం**

గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ డిఅండ్‌హెచ్ఒ కార్యాలయంలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి అధ్యక్షతన జిల్లాస్థాయి గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం అమలుపై సమావేశం సలహా సంఘం సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ స్త్రీ, పురుషులు లేని మానవ సమాజం ఊహకందనిది అన్నారు. పితృస్వామిక భావజాలం నిండి ఉన్న ప్రపంచంలో మనం జీవిస్తున్నామన్నారు. జిల్లాలో కొత్త స్కానింగ్ రిజిస్ట్రేషన్ కోసం ఒక దరఖాస్తు, పునరుద్ధరణకు రెండు దరఖాస్తులు, మార్పులకు 6 దరఖాస్తులు, స్కానింగ్ సెంటర్ మూసివేతకు ఒక దరఖాస్తు అందగా అనుమతులు మంజూరుపై సలహా సంఘం సమావేశంలో చర్చించామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, డాక్టర్ రమణరాజు, ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డెమో శ్రీప్రభాకర రెడ్డి, డిప్యూటీ హెల్ ఎడ్యూకేషన్ అధికారి విఎస్‌కెఆర్.కుమారి, ఎపిడి మిక్ విభాగం ఎంపిహెచ్ఇఒ పి.సుకుమార్ పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజీకి దీపపు కుందు వితరణ

**గణపవరం:** గణపవరం డిగ్రీ కాలేజీకి కాలేజ్ సిపిడిసి నెంబర్ నడంపల్లి శ్రీరామ్ సోమవారం రూ.12 వేల విలువ చేసే దీపపు కుందిలోతోపాటు ఉచితంగా నింపి పూలను పెట్టే పాత్రను కాలేజ్ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలకుమారి మాట్లాడుతూ శ్రీరామ్ కాలేజ్ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు అవసరమైన సామాగ్రిని బహూకరించటం హర్షించతగ్గ విషయమని అన్నారు. శ్రీరామ్ కాలేజీకి అందిస్తున్న సహకారానికి కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూప రాణి, లెక్చరర్లు సిహెచ్.చైతన్య, కెవి.గణేష్ కుమార్, సుబ్బరాజు, లక్ష్మీకుమారి, విద్యార్థులు అభినందించినట్లు తెలిపారు.

## విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ

**పాలకొల్లు రూరల్:** మండలంలోని కాపవరం-2 ఎంపిపి స్కూల్లో బేసిక్ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు శ్రీపసకాల రాయరామమోహన్ శ్రీసేవా సంస్థ వారు రాత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి విద్యా కమిటీ ఛైర్మన్ ఏలేటి కిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.బేబీ సరోజ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, దాతలు సమకూరుస్తున్న సదుపాయాలను వినియోగించుకుని మంచి పౌరులుగా ఎదగాలని, ప్రపంచంలో అతి శక్తివంతమైన ఆయుధం విద్య అని ఆభ్యాసన కృత్యాలు సాధించడంలో ముందు వరుసలో ఉండాలని విద్యార్థులకు తెలిపారు. రాత పుస్తకాలు అందజేసిన సేవా సంస్థకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తరపున కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన

**పాలకొల్లు రూరల్:** గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన కల్పించాలని ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పి లు, ఆశా కార్యకర్తలకు డాక్టర్ నవ్య జీవన్ ఆధ్వర్యాన శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గులాబ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులలో బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులు, ఇతర వ్యాధిగ్రస్తులకు విధిగా పరీక్షలు జరిపి వారికి మందులు అందజేసి, క్యాంపుపై అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న సిబ్బంది అందరూ తమకు ఇచ్చినటువంటి టార్గెట్లను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, హెచ్‌ఎస్‌పి ఎలిజిబెత్, సూపర్వైజర్ ఎన్ఆర్.అమలేశ్వరరావు, జి.ఉదయ్‌చందర్, లక్ష్మీనారాయణ, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## పెదగోపురానికి దేవాలయ ఆర్‌జెసి త్రినాథరావు

**పాలకొల్లు:** పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంనకు సోమవారం ఒక ముఖ్యమైన ఎంక్వయిరీ నిమిత్తం రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాధరావు విచ్చేసారు. గతంలో ఒక అజ్ఞాత భక్తుడు, కొందరు రథం కోసం వెండి కిరీటాన్ని బహూకరించగా అది మాయం కావడంతో పలువురు దేవాలయ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ నిమిత్తం ఆర్‌జెసి వచ్చి విచారించారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముచ్చర్ల శ్రీనివాస రావు, ఇటుల రంగరాజన్, వివిధ దేవాలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తణుకు అభివృద్ధిలో డాక్టర్ ముళ్లపూడి శాశ్వత ముద్ర

**టిడిపి ఆధ్వర్యాన ముళ్లపూడి జయంతి**

**తణుకు:** తణుకు ప్రాంతం అభివృద్ధి కేవలం కీర్తిశేషులు ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ చేసిన కృషి వల్లే సాధ్యమైందని టిడిపి పట్టణ అధ్యక్షులు మంత్రిరావు వెంకటరత్నం అన్నారు. సోమవారం తణుకులో కీర్తిశేషులు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హరిశ్చంద్రప్రసాద్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటరత్నం మాట్లాడుతూ తణుకు ప్రాంతానికి ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ యుగపురుషుడిగా నిలిచిపోతారని అన్నారు. 1947లో ఆయన స్థాపించిన ఆంధ్రాషుగర్స్ కర్మాగారంతో ఎంతో మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో ముళ్లపూడి కుటుంబ సభ్యులతోపాటు టిడిపి పట్టణ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్గో కార్యాలయం తనిఖీ

**పెనుమంట్ర:** మండలంలోని మార్టేరులో ఆర్‌టిసి నరసాపురం డిపోకు చెందిన కార్గో కార్యాలయాన్ని సోమవారం మధ్యాహ్నం నరసాపురం డిపో కార్గో డిఎం ఎ.శివ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్టేరు కార్గో కార్యాలయం పరిసర పెనుమంట్ర, పోడూరు, పెనుగొండ, ఆచంట నలుగు మండలాల ప్రజలకి అందుబాటులో ఉందని ఆయన అన్నారు. ఆర్‌టిసిలో సరుకు రవాణా సేవలు చాలా గాను, చౌక గాను ఉంటాయని వినియోగదారులు కార్గో సేవలు వినియోగించుకోవాలని కోరారు. మార్టేరు-పాలకొల్లు రోడ్‌లో గల కార్గో కౌంటర్ వద్ద పార్సిల్ బుకింగ్, డెలివరి సదుపాయం ఉన్నట్లు చెప్పారు. అలాగే ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్‌టిసి బస్ టికెట్ బుకింగ్ సదుపాయం అందుబాటులో ఉందని తెలియజేశారు. గృహోపకరణాలు సుదూర ప్రాంతమైన హైదరాబాద్‌కు కూడా డిజిటి సర్వీస్ కంటైనర్ ద్వారా అతి తక్కువ ధరలకే మీ ఇంటివద్దకే వస్తువులని చేరవేస్తామని అన్నారు. కార్గో కౌంటర్ బుక్ చేసినవుడు నిషేధిత వస్తువులని బుక్ చేయరాదని, అనుమానిత పార్సిల్ వచ్చినపుడు స్థానిక పోలీసు వారికి తెలియజేయాలని స్థానిక కార్గో ఏజెంట్ బాణాల శ్రీనివాసరావుకి సూచించారు.

## ఆశాలకు వేతనాలు విడుదల చేయాలి : సిఐటియు

**వీరవాసరం:** ఆశ వర్కర్ల జీతాలు విడుదల చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం నవుదూరులో జరిగిన ఆశ వర్కర్ల సమావేశం సంతోష్ వాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ జూన్ నెల వేతనాలు విడుదల కాలేదని అన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ నుంచి రావలసిన వేతనం వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన వేతనం చెల్లించలేదని అన్నారు. అరకొర వేతనాలతో సేవలందిస్తున్న ఆశ వర్కర్లకు నెలవారి వేతనం చెల్లించకపోతే సమస్యలు చెంటుకుంటాయని, రోజువారి ఖర్చులకు కూడా చేతిలో డబ్బులు లేకుండా పోతాయని అన్నారు. తక్షణమే వేతనాలు విడుదల చేయాలని, కాని పక్షంలో ఆందోళన తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ సమావేశంలో రజిని, మల్లేశ్వరి, దుర్గ మాట్లాడారు.

## దాతలు ముందుకు రావాలి : సర్పంచి

**మొగల్తూరు:** పేదరిక నిర్మూలనలో భాగంగా పి-4 విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచి అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామసభలో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో 46 పేద కుటుంబాలను గుర్తించామని వారిని దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. పేద కుటుంబాలలో మార్పులు చేర్పులు, సలహాలు సూచనలు గ్రామ సభ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ముచ్చర్ల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఉప సర్పంచి బోణం నరసింహారావు, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, టౌన్ అధ్యక్షులు బొల్లా చంటి పాల్గొన్నారు.

## కనకాయలంకలో తహశీల్దార్ సమీక్ష

**యలమంచిలి :** గోదావరి వరద క్రమేపి పెరుగుతుండడంతో మండలంలోని కనకాయలంక కాజ్ వే పైకి వరద నీరు చేరే అవకాశం ఉందని ఆ గ్రామంలో తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్ రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రానికి కాజ్వే పూర్తిగా మునిగే అవకాశం ఉందని అటువంటి పరిస్థితి ఏర్పడితే ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

## పకడ్బందీగా డిపార్టుమెంటల్ పరీక్షలు : డిఆర్‌ఒ

**భీమవరం :** ఎపిపిఎస్‌సి ద్వారా నిర్వహించే డిపార్ట్మెంటల్ టెస్టులను జిల్లాలో పగడ్బందీగా నిర్వహించాలని డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈనెల 29, 30, ఆగస్టు 1వ తేదీన నిర్వహించే డిపార్ట్మెంటల్ పరీక్షల నిర్వహణపై పోలీస్, విద్యుత్, ఎపిఎస్‌ఆర్‌టిసి, మెడికల్ అండ్ హెల్త్, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ఆధారిత పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఉదయం సెషన్ 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సెషన్‌కు సంబంధించి కేవలం పరీక్ష ప్రారంభానికి ముందు కేటాయించిన సమయానికి మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. జిల్లాకు సంబంధించిన డిపార్ట్మెంటల్ పరీక్షలను భీమవరం డిఎన్‌ఆర్ అటానమస్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని, పరీక్షకు హాజరయ్యే 200 మంది అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని ఆదేశించారు.



# మరుగుదొడ్డి వాడకం నీళ్లు డ్రెయినేజీలోకి..

**సులభ్ కాంప్లెక్స్ నిర్వాహకుల నిర్వాకం..**
**తీవ్ర దర్గంధంతో స్థానికుల ఆందోళన..**
**సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వేడుకోలు**


శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు రోడ్ల సెంటర్‌లో కోడేరు రోడ్డు వైపు ఉన్న సులబ్ కాంప్లెక్స్ నిర్వాహకులు మరుగుదొడ్డి వాడకం నీళ్లు నెగ్గిపూడి వైపు డ్రెయినేజీకి కలిపేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కాంప్లెక్స్ నిర్వాహకుల నిర్వాకం వల్ల ఈ మార్గంలో వెళ్లే మహిళలు, వృద్ధులు, చిన్నారులు గర్భిణులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఇక్కడ పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇష్టానుసార నీటి వాడకంతో అంతా బురదమయం అవుతుందని వారు అన్నారు. ఉదయం పూట బడులకు, పనులకు వెళ్లే పిల్లలు, పాదాచారులు దుర్గంధం భరించలేక ఇబ్బందులకు గురవుతూ ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవలసి వస్తుందని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు ఇక్కడి సులబ్ కాంప్లెక్స్ నుంచి వచ్చే మురుగునీరు వల్ల వ్యాధులు సంక్రమించకుండా, మురుగు నెగ్గిపూడి గ్రామంలోని ఒకటి రెండు వార్డులలో గల డ్రెయినేజీలో కలవకుండా చూడాలని, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు మార్టేరు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది వారు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం

**నరసాపురం:** మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన కుంకటి పద్మ కుమారులకు జనసేన నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త పోలిశెట్టి శ్రీనివాస్ రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. సోమవారం ఆయన నివాసం వద్ద పిల్లల ఫీజుల నిమిత్తం సొమ్మును అందించారు. పేదరికాన్ని అధిగమించేందుకు విద్య ఒక్కటే మార్గం, పేదలకు ఏ కష్టమొచ్చినా.. ట్రస్టు తరుపున తనవంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుక కిట్స్, తల్లికి వందనం అందిస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**గణపవరం** : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గణపవరం లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెలంకి నరేష్, కిలారి రవిబాబు అన్నారు. సోమవారం క్లబ్ ఆధ్వర్యాన స్థానిక ఒకటవ పాఠశాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లబ్ నాయకులు సిహెచ్.సత్యనారాయణ మూర్తి(బాబ్జి) పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటడంతోపాటు విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేసినట్లు చెప్పారు. పాఠశాలకు ఇంటర్‌నెట్ సౌకర్యంతోపాటు కుర్చీలు వితరణ చేసినట్లు తెలిపారు. అనంతరం హిరో షోరూమ్ వద్ద పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, రావూరి నాగరాజు, కాకర్ల వినాయక, గణపవరం సర్పంచి మూరా అలంకారం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీల్‌చైర్ బహూకరణ


**పాలకొల్లు :** పాలకొల్లులోని శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంనకు సోమవారం కీర్తిశేషులు శిడగం లక్ష్మి నరసమ్మ జ్ఞాపకార్థం వీరి కుమారుడు పాలకొల్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శిడగం సతీష్ వీల్ చైర్ బహూకరించారు. మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సిహెచ్.సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా వీల్ చైర్ దేవస్థానంకు బహూకరించారు. ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాసరావు, సుపరింటెండెంట్ పి.వాసు, ఆలయ సిబ్బంది, లయన్స్ క్లబ్ గవర్నర్ ఎన్‌వివిఎస్.పాపారావు నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

## త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం


సభ్యులను అభినందిస్తున్న ఆర్‌డిఒ

**పాలకొల్లు రూరల్:** మండలంలోని శివదేవుని చిక్కాల వెంకటస్వామి నాయుడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. దీనికి ఛైర్మన్‌గా వడ్డే సోమ చంద్రశేఖర్(గణి), సభ్యులుగా దండు కాశి వెంకట నరసింహారాజు, పంచదార వెంకట రామారావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షులు పాముల రజనీకుమార్ అధ్యక్షత వహించారు. నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఈ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గణి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడుకు రుణపడి ఉంటానని, రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉండి వారి శ్రేయస్సుకు పాటుపడతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దిడ్ల మణి వజ్రం, సొసైటీ కార్యదర్శి మురళీ, ఇంటి శ్రీరాములు, పిచ్చెట్టి బాబు, కోడి విజయభాస్కర్, ఉన్నమట్ల కబర్ధీ, టిడిపి కూటమి నాయకులు, రైతులు హాజరయ్యారు.

## తాగునీటి పైపులైన్‌కు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సర్పంచి కృష్ణకుమారి

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు గ్రామానికి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని, దీనికి డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణరాజు చేసిన కృషి మరువలేనిదని పంచాయతీ సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి అన్నారు. గ్రామంలో రూ.కోటి నిధులతో ఏర్పాటు చేస్తున్న మంచినీటి పైప్ లైన్‌కు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి కృష్ణకుమారి మాట్లాడుతూ మోగల్లు గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న మంచినీటి పరిష్కారానికి అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, నాయకులు కొత్తపల్లి నాగరాజు, నీటి సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సూర్యనారాయణరాజు అందించిన సహకారం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
లీసు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

## పి-4 దత్తత ఒత్తిడి సరికాదు : యుటిఎఫ్

**భీమవరం :** పి-4 పేరుతో ఉపాధ్యాయులను కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోమని దానికోసం వెంటనే రిజిస్టర్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సర్క్యులర్ పంపించడం దారుణమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం అన్నారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయటం దాని వల్ల విద్యార్థులలో అభ్యసనం మందగిస్తుందన్నారు. ఇప్పటికీ బదిలీలు, ప్రమోషన్ అయిన తర్వాత ఎక్కువ శాతం ఉపాధ్యాయులకు జీతాలు అందక మానసికగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

## 30న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పురపాలక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 30న బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ తెలిపారు. ఈమేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

# ప్రజానేత విఎస్.అచ్యుతానందన్

**సిపిఎం ఆధ్వర్యాన ఘన నివాళి**


అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజానేత విఎస్.అచ్యుతానందన్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సిపిఎం నాయకులు కొనియాడారు. సోమవారం భీమవరం రూరల్ తోకతిప్ప గ్రామంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్.అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్, ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా అచ్యుతానందన్ కేరళ ప్రజా జీవితంలో అత్యున్నతమైన స్థానం సంపాదించుకున్నారన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్రకు కొత్తదైన తిరుగులేని సామాజిక, రాజకీయ కోణాన్ని జోడించారని అన్నారు. ఆయన లేకపోవడం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు, తిరుమాణి సూర్యనారాయణ పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు : కలెక్టర్

**భీమవరం :** జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి వ్యవసాయ, మత్స్య, మార్క్ఫెడ్ అధికారులతో ఎరువుల లభ్యత, వినియోగంపై సమీక్షించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు మొత్తం 58,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం గాక వాటిలో యూరియా 21,270 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 37,634 మెట్రిక్ టన్నులు అవసరం అన్నారు. జులై నెలాఖరు నాటికి యూరియా 3,278 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 15,160 మెట్రిక్ టన్నులు అవసరం అన్నారు. నేటికీ జిల్లాలో యూరియా 18,025 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 47,911 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు యూరియా 7,470 మెట్రిక్ టన్నులు, ఇతర ఎరువులు 10,287 మెట్రిక్ టన్నులు అమ్మకాలు జరిగాయని తెలిపారు. ఇవే కాకుండా హోల్‌సేల్, రిటైల్ ఫెర్టిలైజర్స్, ఎపి మార్క్ఫెడ్ వద్ద కూడా ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు అవసరానికి మించి ఎరువులను వినియోగించవద్దని సూచించారు. ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని, తద్వారా మంచి దిగుబడి, తక్కువ పెట్టుబడి, భూమికి సారం లభిస్తాయని తెలిపారు. జిల్లాలో గుర్రపు డెక్క ద్వారా వర్మి కంపోస్ట్ తయారీని చేపట్టడం జరిగిందని, అధిక పోషక విలువలు ఉన్న గుర్రపు డెక్క కంపోస్ట్‌ను అవసరమైన రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి కెఎస్‌వి.నాగలింగాచార్యులు పాల్గొన్నారు.

# సకాలంలో ఫిర్యాదులు పరిష్కరించాలి

**ఆర్‌డిఒ దాసిరాజు**



నరసాపురంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 47 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందని ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**ఎస్‌పి కార్యాలయంలో..**

**భీమవరం టౌన్ :** ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత సమయంలో ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి స్వయంగా జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. ఆయన పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్లకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. 14 ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు రెండు వినతులు అందాయని తహశీల్దార్ కె.రాజ కిషోర్ తెలిపారు. మొగల్తూరు, వీరుపాలెం నార్త్ గ్రామాలలో భూ సర్వే నిర్వహించాలని కోరుతూ ఒక్కొక్క వినతి అందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

**తాడేపల్లిగూడెం :** పిజిఆర్ఎస్‌లో నాలుగు అర్జీలు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 1, ఇంజనీరింగ్ విభాగంలో 3 మొత్తం 4 స్వీకరించినట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపల్ ఇంజనీర్ వైవి.రమణ, అసిస్టెంట్ కమిషనర్ డి.రవికుమార్, ఎసిపి జి.సీతారాం పాల్గొన్నారు.

## యుకెసి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**పాలకొల్లు :** యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక అడబాల గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ముచర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ సేవలను వారు కొనియాడారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. అధ్యక్షునిగా కానూరి ప్రభాకరరావు, కార్యదర్శిగా గుండుమోగుల వీరాస్వామి, కోశాధికారిగా కొండ్రెడ్డి సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ముచర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామమెహన్ చేతుల మీదుగా పాలకొల్లు కాపు సర్వీస్ క్లబ్ వారికి ఈ సంవత్సరం బెస్ట్ క్లబ్‌గా అవార్డు పొందారు. బెస్ట్ ప్రెసిడెంట్‌గా జక్కంపూడి మదన్, బెస్ట్ సెక్రటరీగా వేరుకొండ దుర్గాప్రసాద్ ఎంపికైయ్యారు.

## గోస్తనీ కిక్కిస తొలగింపు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రు నుంచి మాముడూరు వరకు ప్రవహిస్తున్న గోస్తానీ నదిలో ఆవరించి ఉన్న కిక్కిస తొలగింపు పనులు రూ.కోటి 30 లక్షల వ్యయంతో సోమవారం ఇక్కడ ప్రారంభం అయ్యాయి. గోస్తానీ నది ప్రవహించే ప్రాంతంలో తరచూ ముంపు కారణంగా సోమరాజు ఇల్లింద్రపర్రు నుంచి మాముడూరు వరకు 18 కిలోమీటర్లు పంట పొలాలు నష్టానికి గురవుతున్నాయి. గత ఏడాది భారీ వర్షాలకు నాట్లు వేసిన పొలాలు నీటమునిగాయి. నెల రోజులుగా మురుగు దిగువకు వెళ్లకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రాంత రైతులు ఇటీవల జరిగిన పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో సోమరాజు, ఇల్లింద్రపర్రు గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఎంఎల్ఎ పితాని దృష్టికి తీసుకువచ్చారు. గోస్తనీ నది తవ్వకాలు చేపట్టకపోతే క్రాఫ్ట్ హాలిడే స్వచ్ఛందంగా ప్రకటిస్తామని రైతులు చెప్పడంతో చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు సమస్య తలెత్తకుండా సోమరాజు ఇల్లిందలపర్రు వద్ద కిక్కిస తొలగింపు ప్రక్రియ ప్రారంభించినట్లు డ్రెయినేజీ ఎఇ వివేకానంద తెలిపారు. మరో 20 రోజుల్లో గోస్తనీ నదిలో తొలగింపు పనులు పూర్తి చేస్తామని చెప్పారు.